

# వేషం

వాణిశ్రీ

నెల్లూరు టౌన్‌లో ఔట్‌డోర్ షూటింగ్ జరుగుతోంది. చుట్టూ జనం కిటకిట లాడిపోతున్నారు. పోలీసులు వాళ్ళని అదుపుచెయ్యలేక అవస్థపడుతున్నారు.

టిఫిన్ బ్రేక్‌లో డైరెక్టర్ రవిశేఖర్ 'టీ' తీసుకుంటూ వుండగా అసిస్టెంట్ వచ్చి చెవిలో వూదాడు.

"సార్! మీకోసం ఎవరో అమ్మాయి వచ్చింది."

"ఎవరు?"

"తెలీదు సార్. రంభలా వుంది. మన హీరోయిన్ ఆమె ముందు దిష్టి తియ్యడాని క్కూడా పనికిరాదు. నే నెక్కడా అంత అందగత్తెవి చూళ్లేదు. వండ్రఫుల్ పర్సనాల్టీ సార్!"

డైరక్టర్ నోట్లో నీళ్ళూరాయి.

"పేరూ వగైరా అడగొద్దూ? ఎవరో ఆ అమ్మాయి? ఎందుకొచ్చిందో?"

"సినిమావాళ్ళ దగ్గరికి అమ్మాయి లెందుకొస్తారు? వేషం కోసమే" అసిస్టెంట్ నవ్వాడు.

డైరెక్టర్ తల పంకించాడు.

"మీరు గనక ఆవిడని ఇంట్రడూస్ చేస్తే ఇప్పుడున్న బిజీ హీరోయిన్లంతా బజార్లో పడిపోతారు. ఫస్టు పిక్చర్‌తోనే టాప్ కెళ్ళిపోతుంది. హేమమాలిని అయిపోయింది చూడండి అట్లా. ఆ రోజుల్లో ఆదుర్తిగారికి చెప్పా హేమ మాలిన్ని సెలక్టు చెయ్యండి బాబూ అని. ఆయనెందుకో వినలేదు. ఏమైంది? సరా సరి హిందీ ఫీల్డ్ కెళ్ళిపోయి నెంబర్ వన్ అయిపోయింది."

"చూద్దాంలే" అన్నాడు డైరెక్టర్ బోర్ కాల్లేరా నాయనా అన్నట్లు.

"ఆ అమ్మాయిని రూమ్‌లో వెయిట్ చెయ్యమంటారా?" చిలిపికళ్ళతో ఓరగా చూశాడు.

రవిశేఖర్‌తో అతనికి అదే మొదటి పిక్చర్. ఆ తర్వాత గూడా కంటిన్యూ అయిపోయి డైరెక్టర్‌తో పాటు బిజీగా వుండాలని తిప్పలు పడుతున్నాడు.

"మనం పేకప్ చేసేసరికి లేట్ అవుతుందేమో?" అన్నాడు డైరెక్టర్ సందేహిస్తూ.

"ఫర్వాలేదు సార్! ఆ అమ్మాయి వెయిట్ చేస్తుంది. వేషంకోసం ఏమైనా చేస్తారు అమ్మాయిలు."

అసిస్టెంట్ అతని జవాబు కోసం వెయిట్ చెయ్యలేదు.

* * *

బ్రేక్ తర్వాత షూటింగ్ మొదలైంది.

డైరక్టర్‌కి మూడ్ లేదు. తలనొప్పిగా వుందని అమృతాంజనం రుద్దుకుంటూ కూర్చున్నాడు. అసోసియేట్ కథ నడుపుతున్నాడు.

డైరక్టర్ మనసు అసిస్టెంట్ వర్ణించిన రంభమీదకు మళ్ళింది.

'ఎవరో ఆ రంభ? వేషంకోసం వచ్చిందా? - నాటకాల అమ్మాయా - లేక ఫామిలీ లేడీనా?'

సినిమావేషం మోజులో డైరెక్టర్‌కి సర్వస్వం సమర్పించుకునే అమ్మాయిలకు యీ లోకంలో కొరత లేదు.

అసిస్టెంట్ చెప్పేదాన్ని బట్టి చూస్తే ఆ రంభ తనకు ఈ రాత్రి స్వర్గం చూపిస్తుంది.

డైరెక్టర్ గాలిలో తేలిపోయాడు. శరీరం వేడెక్కింది. నరాలు జివ్వుమన్నాయి




'ఈ రాత్రి ఒక మధుర స్వప్నంలా గడపాలి' అనుకున్నాడు.

ఔట్ డోర్ కి వచ్చి పది రోజులు దాటింది. అప్పట్నుంచి పథ్యమే. పెద్ద నిర్మాత చిత్రం ఇది. ఆయనే దగ్గరుండి అన్నీ జాగ్రత్తగా చూసుకుంటాడు, హీరోయిన్ తో సహా. ఎక్స్ట్రాలు బాగా ముదురు. వాళ్ళని చూస్తేనే భయంగా వుంది.

"సార్ పేకప్ చేద్దామంటున్నారు హీరోగారు" అసోసియేట్ అన్నాడు.

డైరెక్టర్ తల వూపాడు.

* * *

సింహపురి హోటల్ కారిడార్ లో కారు దిగాడు డైరెక్టర్.

అప్పుడు రాత్రి ఎనిమిది.

"సార్!" అసిస్టెంట్ దగ్గరికి వచ్చాడు.

"అమ్మాయి వుందా?"

"వుంది సార్."

"వెరీ గుడ్. ఎక్కడుంది?"

"ఇప్పటివరకు రిసెప్షన్ లో కూర్చుంది. వచ్చేపోయేవాళ్ళు ఆ అమ్మాయిని తినేసేట్లు చూస్తున్నారు. ఎవడైనా తన్నుకుపోతాడేమోనని భయం వేసింది."

"ఇప్పుడే రూమ్ లో కూర్చోబెట్టి టిఫిన్ పంపించాను."

"నువ్వేం వెధవ్వేషాలేం వెయ్యలేదు గదా!"

"అమ్మమ్మా...ఎంత మాట సార్! గుమ్మడవుగారి కాండిడేట్ తల్లితో సమానం."

"ఏడ్చావులే."

డైరెక్టర్ నవ్వాడు ఆనందంగా. బార్‌లోకి వెళ్ళాడు.

మామూలుగా అయితే అయిదారు పెగ్గులు తాగుతాడు. కాని ఇప్పుడు అంత కోటా లాభంలేదు. రాత్రి వేస్ట్ అయిపోతుంది. రెండు పెగ్గులు కొట్టి ఈ రాత్రి శివరాత్రి కానివ్వాలి అనుకున్నాడు.

మందు కొట్టాక జర్దాపాన్ బుగ్గన పెట్టి హుంషారుగా బయల్దేరాడు.

'నెక్స్ట్ పిక్చర్‌లో హీరోయిన్ వేషం ఆమెకే ఇస్తానని ప్రామిస్ చెయ్యాలి. అప్పుడిక డైరెక్టుగా ముగ్గులోకి దిగిపోతుంది' అనుకుంటూ ఆమెతో ఎట్లా మాట్లాడాలో మనసులో రిహార్సల్ వేసుకుంటూ అడుగులు వేశాడు.

రాత్రి తొమ్మిది దాటింది.

'ఇప్పటివరకు తనకోసమే ఒంటరిగా వెయిట్ చేస్తున్నదంటే, ఇక ఈ రాత్రికి వుండిపోయే వుద్దేశ్యంతోనే వుందన్న మాటే.'

డైరెక్టర్‌కి ఉత్సాహం పెరిగిపోయింది.

నెమ్మదిగా రూమ్ తలుపు నెట్టాడు.

ఆమె సోఫాలో కూర్చుని ఏదో ఫిలిం మాగ్జయిన్ చూస్తోంది. ఎర్రటి పట్టుచీరలో ఆమెచేతులు బంగారు ఛాయలో మెరిసిపోతున్నాయి.

"ఐయామ్ సారీ!" అన్నాడు అతను.

ఆమె ముఖానికి అడ్డుగా వున్న మాగ్జయిన్ టీపాయ్‌మీద పడేసింది.

డైరెక్టర్ షాక్ తిన్నాడు ఆమె ముఖం చూసి

ఆమె అతని భార్య.

"మీ రిటుబయల్దేరారో లేదో అటు మా బాబాయి పెద్దకూతురు సావిత్రి పెళ్ళి కార్డు వచ్చింది. మధ్యాహ్నం వరకు చూశాను మీ రాస్తారేమోనని. ఫోన్ చేస్తే సినిమావాళ్ళంతా ఔట్‌డోర్‌లో వున్నారని కబురు. రాత్రి పదింటికి గూడా చేశాను బాబూ! తమరు అడ్రస్ లేరు. సరే ఇక్కడే వున్నారుగదాని బయల్దేరి వచ్చాను పదిరోజులున్నుంచి ఇక్కడున్నా బాబాయివాళ్ళింటి వేపు తొంగి గూడా చూశ్చేదటగా! బాబాయి నిష్ఠూరంగా మాట్లాడాడు పెద్ద డైరెక్టరూ అదీ ఇదీ అని. సరే...ఆ గొడవ అలా వుంచండి పెళ్ళి పదిన్నరికి. త్వరగా డ్రస్ అవండి అప్పుడే తొమ్మిది దాటింది."

* *